ననిన గౌతమి యింతంత యనఁగరాని
సంతసము మంతనమ్మున గంతుకొనఁగ
శిశుకళేబరమునుగొని చేరి నగర
మందు నింటింటఁ దిలలఁ బేరాసనడిగె.
ఎందు నాయింతి కవి లభియింపవయ్యె
నగరవీథుల; బత్నినో నాయకునినో
భ్రాతనో సుతనో మాతనో బాంధవులనో
యోటువోవని గృహము లేకుంటఁజేసి.
పట్టణమ్మున నెల్లెడఁ జుట్టితిరిగి,
యందఱకు మృతి సామాన్యమగుటెఱింగి,
తనకు మరణమ్ము నిక్కువమ్మనితలంచి,
యాత్మనెంతయు వైరాగ్య మంకురింప
నెమ్మదినిఁగల యుమ్మలికమ్ముఁ దొలఁచి,
ప్రీతి నొలికి వాటికిఁ దనూజాతునొసంగి,
యవని నెయ్యది శాశ్వతం బనువిచార
మెడఁదఁబొడమ నప్పడఁతి తర్కించె నిట్లు:
“సకలవస్తుసంతతియు నశాశ్వతంబ
యీయనిత్యత్వ మెయ్యెడనేని నొక్క
గ్రామనగరాన్వయములకె కలుగఁబోదు
నిఖిలజనములు సురలు ననిత్యులగుట.”

ముదిత యిటులెంచి, బుద్ధునిమ్రోల నిలిచి,
‘దేవ! దొరకవుతిలలు; నాతిలలవలని
కార్యమునుబూర్తియయ్యె; నక్కజముఁగొల్పు
నశ్వరంబగు జగముచందంబ’టన్న.
తన్వి కిటుబోధసేసె తథాగతుండు
“ప్రబలజలవాహినిని జనపదచయంబు
లీనమగురీతి, మృత్యువులోన మర్త్య
కోట్లు లయమగు సతతము కోర్కులూని.
“సంతు-జనకుండు-బంధులు-జ్ఞాతు-లన్య
లేని, మరణదేవతను వారింపలేరు,
శీలసంశుద్ధుఁడగుచు నీలీలఁదెలియు
పండితుఁడొకండె నిర్వాణపదముఁబొందు.”
చాలనీబోధతత్త్వవిజ్ఞాన మొరిమఁ
గూర్చ, గౌతమి యుప్పు డాసరునికరుణ
నియతి, నుపసంపదను భిక్షుణీవ్రతంబుఁ
బూని, యుక్తార్థమిమ్మయి బుద్ధిఁదెలిసె.
ప్రేమచేఁబుట్టి శోకంబు పెంపుఁగాంచు
తనరు ప్రేమచే భయము నుత్పన్నమగుచుఁ
బ్రేమబంధవిముక్తుఁడౌ నామనుష్యు
నెట్ల శోకంబు భయము బాధింపనేర్చు?

కర్మసరోవరము

శ్రీమతి అయ్యదేవర బాలాత్రిపురసుందరమ్మగారు

౧

అది సంధ్యాసమయము. భానుఁడు నభోమండలమంతట సంచారమొనరించి పశ్చిమటికొండలలోనికి దూఱుచుండెను. శుకపికాదుల కలకలధ్వనులు మాఱుమ్రోగుచుండెను. శకుంతసంతానములు తమతమ గూండ్లవైపు బారులుదీరి పోవుచుండెను. చల్లనిలేమావిగున్నలక్రింద విహరించు యువకులు కాసారములనుండిలేచు పిల్లవాయువుల నాస్వాదించు చుండిరి.

చౌరింతసంస్థానాధీశ్వరుని దుర్గప్రాకారమందుఁ జిత్రవిచిత్రనగిషీలచేఁ జెక్కఁబడిన బొమ్మలు సంధ్యాకాంతులలో లీనమై శిల్పకారులఁ బ్రావీణ్యత జాటుచుండెను. పద్మినీకాంతుఁ డస్తమించెను. కమలములు ముకుళించెను. రాకాసుధాకరుఁ డుదయించెను. కలువలు వికసిల్లెను.

దుర్గప్రాంగణమందుఁగల నొక యుపవనమునందు యిర్వురు స్త్రీలిట్లు సంభాషించు చుండిరి.

కర్మదేవి—అమలా! క్షత్రియస్త్రీలమనస్సులు క్షాత్రతేజమునకు నివాసస్థలములు గదా!

అమల—అమ్మా! సత్యము నీసంకల్పము దృఢమైనది. సాధుమహాశయుని నామమే నిత్యముజపించు చుంటివి. నీబోటి వీరాంగనలకు మాఱుమాట యుండునా!

క—అమలా! సత్యముగ్రహించితివి: సాధుపరాక్రమమువిన్నదాది మనస్సాతనియందే లగ్నమైనది. నాగూరుమొదలు సింధునదివరకు జయించిన వీరుడు అప్పుడప్పుడు మాతండ్రిగారు సాధునికూర్చి పెద్దగాఁ జెప్పెడివారు.

అ—తల్లీ! నీతండ్రి నిన్ను మందరాధిపతి రాజాచండ్ పుత్రుఁడగు అరణ్యాకమలున కీయసంకల్పించినాడు. లగ్నముకూడా నిశ్చయమైనట్లు నేటివార్తలు దెలుపుచున్నవి.

క—ఎట్లెట్లు? అరణ్యాకమలునకు నన్నీయసంకల్పించిరా? నాదురదృష్ట మేమనవచ్చు? ఆతడెంతపరాక్రమశాలియైనను, వీరాధివీరుడైనను నే నతని పరిణయమాడను.

అ—అమ్మా! నీతల్లిదండ్రులమాటఁ దిరస్కరింతువా? వారిమాట వినకున్న నీకు ముప్పువాటిల్లకతప్పదు.

క—అమలా! తాతకు దగ్గులు నేర్పుచుంటివా? వీరక్షత్రియాంగనకు నీతులు నేర్పుచుంటివా? ఆడి తప్పని రాజపుత్ర స్త్రీలకు కళంక మాపాదించుచుంటివా? పతిభక్తిసేవాదురంధరులై, పతివ్రతామతల్లులై, పవిత్రవంశసంభూతలై, పతిపాదపూజావలంబకులై, పతియే దైవము, పతియే గురువు, పతియే మోక్షము, పతియే సర్వాలంకారశోభితము, పతియేసర్వమని, ప్రాణములకైనను వెనుకంజవేయని భారతవీరాంగనల శౌర్యానలమింకను జల్లారలేదు. ఏనాడు సాధుమహాశయుని కీర్తిగంటిచుంపులు నాచెవులలో లీనమయ్యెనో ఆనాడే మాయిర్వురుతనువు లేకమైపోయెను. కలమునకు రెండుపాళీలున్నను వ్రాతఫల మొక్కరూపమేగదా? అమలా! నీవు నాతండ్రికి బోధించి, నాయభిప్రాయ మెరింగించి, వారిప్రయత్నము భంగముగావించి, నామనోరథ మీడేర్పుము.

ఇంతలో లో నుండి యెవరో వీరినిర్వుర బిలువగానె గృహములోని కేగిరి.

౨

మనకథాకాలము అయిదవ శతాబ్దప్రారంభము. ఈకాలమందు మార్వాడదేశమందు ఔరింతసంస్థానమొండుగలదు. ఇదియొక చిన్నసంస్థానము. ఈసంస్థానాధీశ్వరుడు మోహెలరాజు మాణిక్యరాయలు. ఇతడు సద్గుణసంపన్నుడు. విఖ్యాతవరుఁడు. నలుబదేండ్లప్రాయముగలవాడైనను యుద్ధములందారితేరి సాటి రాజపుత్రులలో మేటియై దానకర్ణునిమించు దాతయని యాప్రాంతములలో జెప్పుకొనబడెడువాడు. సుందరమైన వక్షస్థలము, మెలికలుదిరిగిన మీసములు, వెడదరొమ్ము, విశాలమైన ఫాలముగల్గిన వీరుఁడౌటచేఁ గాఁబోలు రాజసింహుఁడను బిరుదునామ మీతనికుండెను.

మాణిక్యరాయలపుత్రికయే కర్మదేవి. ఈమె చిన్నప్పటినుండి విద్యనభ్యసించి, యౌవనవతికాగానే కత్తిసాము, బాణవిద్యలందారితేరి సుగుణసమన్వితురాలై, సౌందర్యఖనియై, ఒప్పులకుప్పయై యాప్రాంతములందుఁ బేరెన్నిక గాంచెను.

అప్పుడప్పుడు వీరింటికి రాణా రంగపుత్రుఁడు సాధునామధేయుఁడు అతిథిగా వచ్చెడివాడు. సాధుమహాశయుఁడు సజ్జనశీలుఁడు. సింహపరాక్రముఁడు. సుందరుఁడు. ఆప్రాంతమందలి శత్రువీరులలోఁ బోరాడుచు, దుర్గముల స్వాధీనముజేసికొనుచు మార్గవశమున మాణిక్యరాయల గృహమునకు వచ్చుచుండెడివాడు.

కర్మదేవి సాధుమహాశయుని పరాక్రమమువినుచు, నాతని సుందరవదనారవిందము గాంచినపుడెల్ల హర్షాంబుధిని నోలలాడుచుండెడిది. సాధువును కర్మదేవిని గాంచుటతోడనే పులకాంకితుఁడై ప్రేమమయదృష్టులఁ బరికించెడివాడు. ఒకరినొకరు గాఢముగాఁ బ్రేమించిరి. ఈసంగతి మాణిక్యరాయలకు తెలియక

తనకుమార్తెకు వివాహముఁజేయ సంకల్పించి మందరాధిపతియైన రాజాచండ్ పుత్రుఁడైన అరణ్యాకమలునకీయ నిశ్చయించెను.

అరణ్యాకమలుఁడును కర్మదేవి సౌందర్యమును, సాహసౌదార్యములను చెవులారవిని ఆపెతోడి సహవాసము స్వర్గావాసమని స్వప్నావస్థలయందుసహితము భ్రమించుచుండెడివాడు.

ఎట్టకేలకు మాణిక్యరాయలు కర్మదేవి మనోనిశ్చయంబెరింగి, అరణ్యాకమలునకు తనయనివ్వక సాధుమహాశయునకే తన తనయనిచ్చి పాణిగ్రహణమహోత్సవము జరిపెను.

ఈవార్త అరణ్యాకమలుని చెవులకు ములుకులవలెనాటెను. ఈతడు మహోగ్రుడై ఆశాభంగమునకుఁ జింతించుచు చేఁజిక్కినపక్షి యెగిరిపోయెనని విచారగ్రస్తుఁడై, ఎట్లనను "నన్నవమానపరచిన సాధునిచంపిన గాని నే క్షత్రియుడగాను" అని శపథముచేసి సాధుమహాశయునికుత్తుక కత్తిరింపవలెనని పగసాధించుటకై వేచియుండెను.

సాధుమహాశయుడు కర్మదేవిని వివాహమాడి కొద్దిరోజులకు మామగారి సెలవుబొరిది భార్యాసమేతుఁడై తనరాజ్యమునకువెడల సంకల్పించి విశ్వాసార్హులగు 700ల వీరభటులతో కర్మదేవిని వెంటనిడుకొని బయలుదేరెను.

3

అరణ్యాకమలునిసేనలకు సాధుమహాశయునిసేనలకు పోరాటము ప్రారంభమయ్యెను. పదాతులు పదాతులతో, సేనాధిపతులు సేనాధిపతులతో, ఆశ్వికదళము లాశ్వికదళములతో ఘోరసంగ్రామము జరుపుచుండిరి. ఎచ్చట చూచినను రక్తప్రవాహములే! ఏమూలజూచినను ఎముకలగుట్టలే. ఏవైపు పరికించినను గాయములుపొంది పొర్లాడుచున్న శూరులకళేబరములే. ఏతట్టుచూచినను వీరులమొండెములు రక్తప్రవాహములో దేలియాడుచుండెను.

సాధు మహాశయుని సేనలు చెల్లాచెదరై పోయెను. సాధు మహాశయుడు యీమారు కర్మదేవివైపు కడసారిచూపుల బఱపి ననుజ్ఞబొంది మహోగ్రుడై, తీవ్రకోపాగ్నిజ్వాలలు రేగుచుండ కరవాలము ఝుళిపించుచు, అరణ్యాకమలునితో ద్వంద్వయుద్ధము జేయుచుండెను. ఇర్వురు సమానవీరులౌటచే భీమశల్యులభంగి పోరాడుచుండిరి. వీరిపోరాటము అత్యద్భుతముగా నుండెను.

కొంతవడికి గదాయుద్ధము ప్రారంభించిరి. ఇర్వురిశిరములు వ్రక్కలైనెత్తుటేర్లు ప్రవహించు చుండినను, వారిపౌరుషము ఏమాత్రము తగ్గలేదు. ఇట్లు చాలసేపుఁబోరాడి యిర్వురు మూర్ఛజెంది ధరణిపైవ్రాలి దీర్ఘనిద్ర జెందిరి.

అంతట కర్మదేవి సాధుమహాశయుడుమరణించుటఁ గాంచి, తనమనోహరుని గలియుటకై సంకల్పించుకొని కరవాలముదీసి తన వామభుజమును దెగవేసి యొకభటునకిచ్చి వానితో నిట్లనియె: "దీనిని నీవు నామామగారికిచ్చి యిట్లని విన్నవింపుము: మీకోడలు వీరస్వర్గమలంకరించినది. ఈలోకమునకు, మీకు కాన్పింపదు. భర్తతో సురలోకమున హాయిగా కాలక్షేపమొనర్చును. కొడుకును, గోడలును స్వర్గమునందు సుఖులైయున్నారు."

ఇట్లుచెప్పి మరియొకభటునిపిలిచి రెండవచేయి నరుకుమని యాజ్ఞయిచ్చెను. వాడెంతసేపటికి నరకకుండుట గాంచి కఠినమైన యాజ్ఞయిచ్చెను. భటుడు రెండవచేతినికూడా నరకెను. అంత నామె పుట్టినింటి నుండివచ్చిన మరియొకభటునిపిల్చి "నీవీహస్తము గొంపోయి తండ్రిగారికి పుత్రికారత్నము కాన్కగాపంపెననుము."అనుచు నావీరబాల చితిని బేర్పించుకొని భర్తప్రేతము చితిపైనుంచి తాను చితిపైగూర్చుండి చితికి నిప్పుఅంటించుకొనెను. అగ్నిహోత్రుడామెను భస్మీభూతముజేసెను. అప్పటినుండి ఆమెకీర్తిచంద్రిక లెల్లెడ వ్యాపించెను. పుత్రశోకమువలన రణరంగదేవు కోడలిహస్తమున కగ్నిసంస్కారముసేసి యాస్థలమందొక సరోవరమును త్రవ్వించెను. ఇప్పటికి ఆపవిత్రసరోవరమును "కర్మసరోవర"మని పిలుతురు.